సాక్షి చిత్తూరు

మంగళవారం । 26 । మార్చి । 2024



హోలీ..ఆనందాల కేళి

వి.కోట మాతాజీ ఆలయం వద్ద హోలీ సంబరాలు అంబరాన్నంటాయి. ఎంపీ రెడ్డెప్ప ఎమ్మెల్యే వెంకటేగౌడ పాల్గొన్నారు. - 8లో



రూ.అరకోటి మద్యం స్వాధీనం

కర్ణాటక నుంచి కుప్పానికి తరలిస్తున్న రూ.54 లక్షల కర్ణాటక మద్యాన్ని ఎస్ఈబీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. - 8లో

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ మంగళవారం(సా)	సహర్ బుధవారం(ఉ)
చిత్తూరు	6.29	4.52
పుంగనూరు	6.31	4.56

రగులుతున్న కూటమి !



'పార్టీలనే నమ్ముకున్నాము. ఈ ఐదేళ్లలో సొంత డబ్బులు పెట్టి ఎన్నో కార్యక్రమాలు చేశాము. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాలు మోశాము. ప్చ్..! ఏం లాభం. అధినేతలెవ్వరూ గుర్తించలేదు. మా విన్నపాలు ఆలకించ లేదు. కాళ్లమొక్కినా.. ఆత్మాభిమానం తాకట్టుపెట్టినా.. కనికరించలేదు. స్థానిక నేతలందర్నీ పక్కన పెట్టేశారు. కరివేపాకులా వాడుకుని వదిలేశారు. స్థానికేతరులకు టిక్కెట్లు ఇచ్చి మమ్మల్ని తీవ్రంగా అవమానించారు. ఇప్పుడు ప్రజల్లోకి ఎలా వెళ్లాలి. ఇన్నాళ్లూ మేమే అభ్యర్థులమని ప్రజలను ఒప్పించి.. ఇప్పుడు పొత్తులో భాగంగా వేరొకరికి ఓట్లు వేయండని ఎలా అడగాలి..? అంటూ తిరుపతిలోని కూటమి నేతలందరూ కుమిలిపోతున్నారు. కొందరు లోలోపలే రగిలిపోతుండగా.. మరికొందరు బాధను దిగమింగుకోలేక బహిరంగంగా కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. ఇంకొందరు మౌన వ్రతం పాటిస్తూ.. అధికార పార్టీకి జై కొట్టేందుకు సిద్ధమైపోయారు.

- తిరుపతి అసెంబ్లీ, ఎంపీ సీట్లు స్థానికేతరులకే
- స్థానికుల ఆశలపై నీళ్లు
- ఓటమి భయంతో చంద్రబాబు పొత్తులు
- ఐదేళ్లుగా కష్టపడ్డా ఫలితం లేదని టీడీపీ నేతల నిట్టూర్పు
- పార్టీ జెండా మోసినా గుర్తింపు ఇవ్వలేదని కన్నీళ్లు
- లోలోపలే రగిలిపోతున్న ఆశావహులు

సాక్షి, తిరుపతి: సార్వత్రిక ఎన్నికల్లో ఎంపీ, అసెంబ్లీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు తిరుపతి నగరానికి చెందిన టీడీపీ నేతలు ఆశగా ఎదురుచూశారు. అయితే ఓటమి భయంతో చంద్రబాబు బీజేపీ, జనసేనతో పొత్తు పెట్టుకుని టీడీపీ నేతల ఆశలపై నీళ్లు చల్లారు. తిరుపతి పార్లమెంట్ బీజేపీకి, అసెంబ్లీ జనసేనకు కట్టబెట్టి టీడీపీ ఆశావహులకు కన్నీళ్లు మిగిల్చారు. ఐదేళ్ల పాటు పార్టీ కార్యక్రమాలకు చేసిన ఖర్చులు, కేటాయించిన సమయం అంతా వృథా అవ్వడంతో టీడీపీ నేతలు తీవ్ర ఆందోళనలో మునిగిపోయారు.

ఆశల కురుక్షేత్రం!

ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లుతున్న తిరుపతి మహానగరం దేశంలోనే ప్రసిద్ధి గాంచింది. ఇటువంటి ఆధ్యాత్మిక క్షేత్రం నుంచి ఒక్క సారైనా ఎన్నికల్లో పోటీచేసి గెలవాలని ప్రతి రాజకీయ నాయకుడు కోరుకుంటాడు. అలా కోరుకున్న మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, తుడా మాజీ చైర్మన్ నరసింహయాదవ్‌తో పాటు కోడూరు బాలసుబ్రమణ్యం, జేబీ శ్రీనివాసులు, ఊకా విజయకుమార్, మబ్బు దేవనారాయణరెడ్డి, మీడియా కో–ఆర్డినేటర్ శ్రీధర్‌వర్మ ఉన్నారు. వీరంతా అధిష్టానం ఆదేశాల మేరకు సొంత డబ్బు ఖర్చుచేసి కార్యక్రమాలు నిర్వహిస్తూ వచ్చారు. ఇదంతా చేయడానికి ప్రధాన కారణం ఎన్నికల్లో పోటీచేసే అవకాశం కల్పిస్తారనే ఆశ.

అభద్రతా భావం..పొత్తుకు శ్రీకారం

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులు పరుగులు పెట్టించారు. వివిధ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్, ఆలయాల పాలక మండళ్లు, స్థానిక సంస్థల ఎన్నికల్లో పదవులు.. ఇలా రాజ్యాంగ బద్ధమైన పదవులన్నింటినీ భర్తీచేసి వైఎస్సార్ సీపీ కోసం పనిచేసిన వారందరికీ న్యాయం చేశారు. ఆ పదవుల నియామకాల్లోనూ సామాజిక న్యాయాన్ని పాటించారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో చేయని విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ వర్గాల్లోని అన్ని ఉప కులాల వారికి పదవులు కట్టబెట్టి శభాష్ అనిపించుకున్నారు. ఇంకా.. మహిళలకు కూడా రాజ్యాంగ పదవుల్లో అధిక శాతం మందికి పదవులు ఇచ్చి మన్ననలు పొందారు. చంద్రబాబు చేయలేని పనులన్నింటినీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక చేసి చూపించారు. ఆయన తీసుకునే నిర్ణయాల పట్ల జనం మరింత ఆకర్షితులయ్యారు. ఈ సారి ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన చంద్రబాబు పొత్తుల కోసం ఆరాటపడ్డారు. ఇందులో భాగంగానే తిరుపతి జిల్లాలో కీలకమైన తిరుపతి పార్లమెంట్, అసెంబ్లీని వదులుకున్నారు. ఇది ఎన్నికల ముందే టీడీపీ ఓటమిని ఒప్పుకున్నట్లేనని ఆ పార్టీ శ్రేణులు భావిస్తున్నారు.

తిరుపతిలో టీడీపీ జెండా కనుమరుగే!

చంద్రబాబు తీసుకున్న నిర్ణయంతో తిరుపతి నగరంలో టీడీపీ పూర్తిగా కనుమరుగు కానుంది. ఆత్మ విశ్వాసం, పార్టీ కేడర్‌పై నమ్మకం లేని నాయకుని వెంట నడవడంకంటే.. ఇచ్చిన మాట కోసం నిలబడే వ్యక్తి, ఆ నాయకుడి అడుగులో అడుగువేయడం మంచిదనే నిర్ణయానికి వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీ మారడానికి ఇష్టం లేని నాయకులంతా ఇకపై రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

చేతకాని దద్దమ్మల్ని చేశారు

పొత్తులో భాగంగా చంద్రబాబు తిరుపతి పార్లమెంట్, అసెంబ్లీని వదులుకుని స్థానిక టీడీపీ నేతలందరినీ దద్దమ్మల్ని చేశారని ఆశావహులు మండిపడుతున్నారు. వీరిలో కేంద్ర మాజీ మంత్రి పనబాకలక్ష్మి ఒకరు. టీడీపీకి అభ్యర్థి ఎవ్వరూ లేని సమయాల్లో పనబాక లక్ష్మి ముందుకు వచ్చి పార్లమెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తూ వచ్చారు. అటువంటి ఆమెకు చంద్రబాబు హ్యాండిచ్చారు. టీడీపీలోనే అనుకుంటే.. బీజేపీ, జనసేన అధినేతలు కూడా స్థానికేతరులనే అభ్యర్థులుగా ప్రకటించి స్థానిక నేతలను అవమానించారు. జనసేన విషయానికి వస్తే తిరుపతిలో పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్‌తో పాటు మరికొందరు పార్టీ కోసం శక్తివంచన లేకుండా పనిచేశారు. బీజేపీలోనూ పార్టీని నమ్ముకుని పనిచేస్తున్న వారందరినీ కాదని స్థానికేతరుడైన వరప్రసాద్‌ని అభ్యర్థిగా ప్రకటించడం పట్ల కమలనాథులు రగిలిపోతున్నారు.

సుగుణమ్మ కన్నీళ్లు

కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు అభ్యర్థిత్వంపై మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ కలత చెందారు. సోమవారం ఆమె తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కన్నీటి పర్యంతమయ్యారు. ఇది ధర్మమా.. న్యాయమా అంటూ ఆవేదనకు లోనయ్యారు. చంద్రబాబు మరోసారి పునరాలోచించాలని సూచించారు.

న్యూస్‌రీల్

కౌంటింగ్ కేంద్రంలో పకడ్బందీ ఏర్పాట్లు



సూచనలిస్తున్న జిల్లా ఎన్నికల అధికారి షణ్మోహన్

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల ఓట్ల కౌంటింగ్ కేంద్రంలో ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ ఆదేశించారు. సోమవారం జిల్లా కేంద్రానికి సమీపంలో ఉన్న ఎస్వీ సెట్ ఇంజినీరింగ్ కళాశాల కౌంటింగ్ కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలను పాటిస్తూ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఏ మాత్రం అలసత్వం వహించ కూడదని తెలిపారు. ఈవీఎంలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పటిష్ట భద్రత ఉండాలన్నారు. కౌంటింగ్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించిన మ్యాపులు, కళాశాల విస్తీర్ణం తదితరాలను పరిశీలించి సూచనలిచ్చారు. పోలింగ్ అనంతరం చిత్తూరు పార్లమెంట్ నియోజక వర్గం, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు ఉంటుందన్నారు. చిత్తూరు ఆర్‌ఓ, జేసీ శ్రీనివాసులు, డీఆర్‌ఓ పుల్లయ్య, పూతలపట్టు ఆర్‌ఓ, చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య, సర్వే, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీసీ వద్దకు చేరింది. ఆదివారం అర్ధరాత్రి వరకు 80,532 మంది స్వామిని దర్శించుకున్నారు. 29,438 మంది తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.95 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో దర్శనం లభిస్తోంది.

● గోవిందా..గోవిందా



పున్నమి వెలుగులు..చల్లటి గాలుల నడుమ తిరుమలలో శ్రీవారు సోమవారం రాత్రి గరుడ వాహనంపై విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. గోవింద నామస్మరణతో భక్తులు దర్శించి పులకించారు. - తిరుమల

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక దేవస్థానం అనుబంధ శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో సోమవారం పౌర్ణమి సందర్భంగా సత్యనారాయణ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరదరాజుల స్వామికి తొలుత ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని శ్రీసత్యనారాయణస్వామిగా విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుప రి భక్తులతో సామూహిక సత్యనారాయణ వ్రతం నిర్వహించారు.

వైఎస్సార్‌సీపీలోకి జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యంరెడ్డి

- దేశానికే ఆదర్శంగా జగనన్న పథకాలు
- కుప్పంలో వైఎస్సార్ సీపీ జెండా ఎగురవేస్తాం

కుప్పంరూరల్: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎం.సుబ్రమణ్యంరెడ్డి సోమవారం వైఎస్సార్ సీపీలో చేరారు. తిరుపతిలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నివాసంలో ఆయనకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీడీపీలో పీఎంకే హుడా చైర్మన్‌గా వ్యవహరించిన సుబ్రమణ్యంరెడ్డి శాంతిపురం మండలం, శివరామపురం వాసి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా ఉన్నాయని, జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే రాష్ట్రం అభివృద్ధితో పాటు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమని అన్నారు. కుప్పంలో వైఎస్సార్ సీపీ పటిష్టతకు, పార్టీ అభ్యర్థి గెలుపునకు తనవంతు కృషి చేస్తానని చెప్పారు. వైఎస్సార్ సీపీ జెండా ఎగుర వేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రెస్కో చైర్మన్ సెంథిల్‌కుమార్ పాల్గొన్నారు.



సుబ్రమణ్యంరెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కోడ్ ఉల్లంఘనలపై సమగ్ర విచారణ

చిత్తూరు కలెక్టరేట్ : సార్వత్రిక ఎన్నికల కోడ్ ఉల్లంఘనలపై అందిన ఫిర్యాదులను జిల్లా ఎంసీసీ బృందం పకడ్బందీగా సమగ్ర విచారణ నిర్వహిస్తోంది. ఈ మేరకు ఈ నెల 25న 9 ఫిర్యాదుల పట్ల ఎంసీసీ అధికారులు స్పందించారు. క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్‌కు ఎంసీసీ జిల్లా నోడల్ ఆఫీసర్ మురళికృష్ణ నివేదికను సమర్పించారు. ఆ నివేదికలో పత్రికలలో వచ్చిన 8, సామాజిక మాధ్యమంలో అందిన ఒకటి మొత్తం తొమ్మిది ఫిర్యాదులను క్షేత్రస్థాయి అధికారులతో విచారించి చర్యల నిమిత్తం వివరాలను ఆ నివేదికలో నమోదు చేశారు. నగరి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో కుక్ కం హెల్పర్‌గా పనిచేస్తున్న సికిందర్ టీడీపీ కండువా కప్పుకోవడంపై విచారణ జరిపిన ఎంసీసీ బృందం సర్వీస్ నుంచి తొలగించాలని సిఫార్సు చేసింది. కాణిపాకంలో కోడ్ ఉల్లంఘన ఫిర్యాదు పట్ల శ్రీవరసిద్ధి వినాయక దేవాలయం ఈఓకు, పూతలపట్టు ఆర్‌ఓ చిన్నయ్య షోకాజ్ నోటీసు జారీచేసి 24 గంటల్లో వివరణ ఇవ్వాలని పేర్కొన్నారు. అలాగే మరికొన్ని ఫిర్యాదులను ఎంసీసీ కమిటీ బృందం పకడ్బందీగా పరిశీలించి చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తున్నట్లు ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

1నుంచి టెన్త్ స్పాట్ వాల్యుయేషన్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా కేంద్రంలోని పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి పదవ తరగతి జవాబుపత్రాల మూల్యాంకనం చేపట్టనున్నారు. ఈమేరకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇతర జిల్లాల నుంచి వచ్చిన జవాబుపత్రాలను స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరుస్తున్నారు. ఏప్రిల్ 8వ తేదీలోపు మూల్యాంకనం పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నారు. ఏప్రిల్ 6 వ తేదీ నుంచి సమ్మేటివ్ అసెస్‌మెంట్–2 మొదలు కానుండడంతో సిబ్బంది కొరత రాకుండా చర్యలు చేపడుతున్నారు.

వైఎస్సార్‌ సీపీతోనే అభివృద్ధి సాధ్యం


టీడీపీ నుంచి వైఎస్సార్‌ సీపీలో చేరిన వారితో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

కార్వేటినగరం: పేదల ఆర్థికాభివృద్ధి ఒక్క వైఎస్సార్‌ కాంగ్రెస్‌ పార్టీ తోనే సాధ్యమని ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. సోమవారం మండల పరిధిలోని టీకేఎం పేట, సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు శ్రీనివాసులు యాదవ్, కడప రవి, రవీంద్రబాబుతో పాటు పలువురు ఉప ముఖ్యమంత్రి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సీఎం జగనన్నతోనే సాధ్యమని గుర్తించిన టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీలోకి వలసలు వస్తున్నారన్నారు. నాడు స్కిల్‌ స్కాం నుంచి నేడు గంజాయి తరలింపు కేసుల్లో చిక్కి అవినీతితో కూరుకుపోయి, అధికారం కోసం పొత్తులతో ఉనికిని కాపాడుకునేందుకు చూస్తున్న చంద్రబాబు అండ్‌కో పార్టీలను ప్రజలు పట్టించుకోవడం లేదన్నారు. మహిళా పక్షపాతిగా సంక్షేమాలు అందించిన జగనన్న వైపే జన బలం ఉందని తెలిపారు. వైఎస్సార్‌ సీపీలో చేరిన టీడీపీ నాయకులు శ్రీనివాసులు యాదవ్‌ మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేని విధంగా బీసీలకు రాజకీయంగా ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్మోహన్‌రెడ్డి సముచిత స్థానం కల్పించారని, అలాగే నియోజకవర్గ అభివృద్ధిలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఐదేళ్లలో 30 సంవత్సరాల అభివృద్ధిని చేసి చూపించారని తెలిపారు. అనంతరం పార్టీలో చేరిన వారికి ఉప ముఖ్యమంత్రి కండువాలు కప్పి వైఎస్సార్‌ సీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల మాజీ కన్వీనర్‌ ధనంజయవర్మ, ఏఎంసీ డైరెక్టర్‌ ఆకుల గోపి, ఎంపీటీసీ సభ్యుడు ధనదరాజ్‌ తదితరులు పాల్గొన్నారు.

పౌరుల చేతిలో

యాప్‌లే బ్రహ్మాస్త్రాలు


- ఎన్నికల్లో అక్రమాలపై ఫిర్యాదులకు ప్రత్యేక యాప్‌లు
- పరిష్కారానికి వేగవంతమైన చర్యలు
- దివ్యాంగులకు వరంలా సరికొత్త ఫీచర్లు
- ఎన్నికల ఖర్చు, పోలింగ్‌ బూత్‌ల సమాచారం సులువుగా తెలుసుకునే సదుపాయం
- ఎన్నికల కమిషన్‌ ఆధ్వర్యంలో నిర్వహణ

చిత్తూరు కలెక్టరేట్‌: పారదర్శక ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల కమిషన్‌ ప్రతిసారీ కొత్త పద్ధతులను ప్రవేశపెడుతూ ఉంటుంది. ఈసారి ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేసేందుకు..పౌరులను భాగస్వామ్యం చేసేందుకు వివిధ రకాల యాప్‌లను ప్రవేశపెట్టింది. సీ విజల్, సువిధ, కేవైసీ, అబ్జర్వర్, సాక్షం, ఓటరు హెల్ప్, నేషనల్‌ గ్రీవెన్స్‌ సర్వీస్‌ పోర్టల్‌ యాప్‌లను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం, కోడ్‌ ఉల్లంఘనపై ఫిర్యాదు, ఎన్నికల నియమావళి, ఓటర్లుకు అవసరమైన సాయం, ఎన్నికల ఖర్చు, పోలింగ్‌ బూత్‌ల వివరాలు, ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాల సమాచారం తెలుసుకునేందుకు ఇవి ఉపయోగపడతాయి. వివరాలు మీ కోసం..

సువిధ యాప్‌

ఇది ఎన్నికల సమయంలో అభ్యర్థులకు నామినేషన్‌ అనుమతి ప్రక్రియలో సహాయపడేందుకు అభివృద్ధి చేసిన అప్లికేషన్‌. సువిధ క్యాండిడేట్‌ యాప్‌ను ఉపయోగించేందుకు అభ్యర్థులు ఖాతాను రిజిస్టర్‌ చేసుకుని వారి ఆధారాలతో లాగిన్‌ కావాలి. తర్వాత, అభ్యర్థులు తమ నామినేషన్ల అనుమతిని చూడవచ్చు. సువిధ క్యాండిడేట్‌ యాప్‌ అభ్యర్థులకు అనేక ఇతర ఫీచర్లు అందిస్తుంది. ప్రచారానికి అవసరమైన అనుమతుల గురించి తెలుసుకోవచ్చు.

కేవైసీ యాప్‌



మీ అభ్యర్థిని తెలుసుకునేందుకు, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నేర చరిత్ర గురించి తెలుసుకునేందుకు ఈ యాప్‌ ఉపయోగపడుతుంది. అభ్యర్థిపై క్రిమినల్‌ కేసుల వివరాలు, ఆ కేసుల స్థితి, నేరాల స్వభావం ఉంటాయి. నేర చరిత్ర ఉన్న అభ్యర్థులను గుర్తించేందుకు, వారికి ఓటు వేయకుండా ఉండేందుకు ఓటర్లకు సహాయపడుతుంది.

అబ్జర్వర్‌ యాప్‌

ఇది ఎన్నికల కోడ్‌ దుర్వినియోగం, అక్రమాలకు సంబంధించిన కేసులను తెలుసుకునేందుకు పరిశీలకులకు ఉపయోగపడుతుంది. యాప్‌ను ఉపయోగించేందుకు పరిశీలకులు ముందుగా ఖాతాను సృష్టించి వారి కోడ్‌, పాస్‌వర్డ్‌తో సమాచారాన్ని అందించాలి. అబ్జర్వర్‌ యాప్‌ సాయంతో అక్రమాలను అడ్డుకునేందుకు అనుమతిస్తుంది. తమ నియోజకవర్గానికి సంబంధించిన పోలింగ్‌ స్టేషన్ల సంఖ్య, ఓటర్ల సంఖ్య, రిటర్నింగ్‌ అధికారి కార్యాలయం ఉన్న ప్రదేశం వంటి సమాచారాన్ని యాక్సెస్‌ చేసేందుకు ఇది ఉపయోగపడుతుంది.

ఓటరు హెల్ప్‌లైన్‌ యాప్‌



ఓటరు హెల్ప్‌లైన్‌ యాప్‌లో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా వివరాలు, ఎలక్టోరల్‌ రోల్‌లో మీ పేరును సెర్చ్‌ చేయడం, ఓటు వేసేందుకు అర్హత ఉన్నారో లేదో తనిఖీ చేసేందుకు ఈ యాప్‌ను ఉపయోగించవచ్చు. డిజిటల్‌ ఫొటో ఓటర్‌ స్లిప్‌ను డౌన్‌లోడ్‌ చేసుకోవచ్చు. ఎన్నికలకు సంబంధించిన వార్తలు, అప్‌డేట్‌లు పొందవచ్చు.

దివ్యాంగుల కోసం యాప్‌

దివ్యాంగులకు సేవల కోసం సాక్షం యాప్‌ తీసుకొచ్చారు. ఈయాప్‌తో పోలింగ్‌ రోజున వీల్‌ చైర్‌ కోసం రిక్వెస్ట్‌ చేయొచ్చు. పోలింగ్‌ స్టేషన్‌ తెలుసుకునేందుకు సహాయం చేసేలా అనేక ఫీచర్లను అందిస్తుంది. దృష్టి లోపం ఉన్న దివ్యాంగుల కోసం వాయిస్‌ సహాయాన్ని అందిస్తుంది. టెక్స్ట్‌–టు–స్పీచ్‌ అందిస్తుంది. దివ్యాంగులకు అనేక ఫీచర్లు ఉన్నాయి.



సీ విజిల్‌

ఈ యాప్‌లో ఎన్నికల ఉల్లంఘనలపై సాక్ష్యాలతో సహా పొందుపరచ వచ్చు. ఫొటో లేదా వీడియో లేదా ఆడియో రూపంలో రికార్డ్‌ చేసి యాప్‌లో అప్‌లోడ్‌ చేయాలి. ఫిర్యాదు చేసిన ఐదు నిమిషాల్లో ఎన్నికల అధికారులు రంగంలోకి దిగుతారు. దీనిపై విచారణ చేపట్టి 100 నిమిషాల్లో సదరు ఫిర్యాదుపై కచ్చితమైన చర్యలు తీసుకుంటారు. పార్టీలకు అతీతంగా ఎవరు ఉల్లంఘటనకు పాల్పడినా ఫిర్యాదు చేయవచ్చు. గూగుల్‌ ప్లే స్టోర్‌ నుంచి దీన్ని డౌన్‌ లోడ్‌ చేసుకోవాలి. మీ ఫోన్‌ నంబరు ద్వారా రిజిస్టర్‌ చేసుకోవాలి. డబ్బు పంపకాలు, ఉచితాలు, బహుమతుల అందజేత, రెచ్చగొట్టే ప్రకటనలు, మద్యం, మత్తు పదార్థాల పంపిణీ, ఓటర్లను ప్రభావితం చేయడం, ఎన్నికల రోజు ఓటర్లను వాహనాల్లో తరలించడం ఇలా ఉల్లంఘనలను ఫొటో లేదా వీడియో లేదా ఆడియో క్లిప్‌గా అప్‌లోడ్‌ చేయాలి. యాప్‌ తెరవగానే ఫొటో, వీడియో, ఆడియో అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. సదరు ఉల్లంఘనను క్లుప్తంగా వివరించాలి. యాప్‌లో వివరాలు పొందుపర్చగానే జిల్లా ఎన్నికల అధికారి ఐదు నిమిషాల్లో దాన్ని ఫీల్డ్‌ యూనిట్‌కు పంపిస్తారు. వారు 15 నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటారు. విచారించి 30 నిమిషాల్లో వివరాలు సేకరిస్తారు. అనంతరం ఎన్నికల అధికారికి నివేదిస్తారు. మీరు చేసిన ఫిర్యాదు స్టేటస్‌ కూడా తెలుసుకునే వెసులుబాటు ఉంది.

నేషనల్‌ గ్రీవెన్స్‌ సర్వీస్‌ పోర్టల్‌

నేషనల్‌ గ్రీవెన్స్‌ సర్వీస్‌ పోర్టల్‌ (ఎన్‌జీఎస్‌పీ) ఎన్నికలకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కరించేందుకు ఈసీకి సహాయం చేయడంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఓటరు తమ మొబైల్‌ నంబర్‌ను ఉపయోగించి పోర్టల్‌లో ప్రొఫైల్‌ను నమోదు చేసుకోవచ్చు. ఇందులో ఓటరు తమ ఫిర్యాదును నమోదు చేయొచ్చు. ఓటరు ఫిర్యాదు చేసిన తర్వాత, అది విచారణ కోసం ఎన్నికల అధికారికి వెళ్తుంది. ఎన్నికల అధికారి నిర్ణీత వ్యవధిలోగా స్పందించాల్సి ఉంటుంది. పోలింగ్‌ బూత్‌ స్థానాలు, ఎలక్ట్రానిక్‌ ఓటింగ్‌ యంత్రాలు, ఎన్నికల ఖర్చు, ఎన్నికల అక్రమాలు వాటికి సంబంధించి ఫిర్యాదులను సకాలంలో ఈ యాప్‌ పరిష్కరిస్తుంది. పౌరులు తమ ఫిర్యాదులు ఏ స్థాయిలో ఉన్నాయో ట్రాక్‌ చేయవచ్చు.

హోలీ..ఆనందాల కేళి


హోలీ సంబరాల్లో పాల్గొన్న ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ

వి.కోట: పట్టణ పరిధిలోని ఆయి మాతాజీ ఆలయం వద్ద శనివారం మండలంలోని మర్వాడీలు నిర్వహించిన హోలీ వేడుకలు అంబరాన్నంటాయి. మార్వాడీల ఆహ్వానం మేరకు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ సంబరాల్లో పాల్గొన్నారు. ఎంపీ, ఎమ్మెల్యే మాట్లాడుతూ అరిష్వర్గాల రూపంలో ప్రతి మనిషిలో ఉండే కాముడిని, హోలీక రూపంలో ఉన్న చెడును దహించి, ఆనందమనే రంగులద్దుకునే హోలీ పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. అంతరం మార్వాడీలతో కలిసి రంగులు చల్లుకుని వారితో ఆనందం పంచుకున్నారు. అలాగే పట్టణంలో యువకులు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు కొట్టారు. ఎంపీపీ యువరాజు, వైఎస్సార్‌ సీపీ రాష్ట్ర కార్యదర్శి పీఎస్‌ నాగరాజు, మండల కన్వీనర్‌ బాలగురునాథ్, వైస్‌ ఎంపీపీ డాక్టర్‌ తమీమ్, లాబూరాంసేట్‌ తదితరులు పాల్గొన్నారు.

3 ఇసుక ట్రాక్టర్ల సీజ్‌

సాక్షి ఎఫెక్ట్‌..

పలమనేరు: పట్టణ సమీపంలోని కౌండిన్య నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్లను పోలీసులు సీజ్‌ చేశారు. ఈనెల 22న ‘సాక్షి’లో ప్రచురితమైన ‘కోడ్‌ బేఖాతర్‌’ కథనంపై స్పందించిన పట్టణ సీఐ చంద్రశేఖర్, స్థానిక రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకున్నారు. కౌండిన్య నుంచి అక్రమంగా తరలుతున్న మూడు ట్రాక్టర్లను సీజ్‌ చేసి, కేసులు నమోదు చేశారు. మరోవైపు రెవెన్యూ అధికారులు కౌండిన్య నది నుంచి ఇసుక తరలించే మార్గాల్లో వీఆర్‌ఏలను నిఘాలో ఉంచారు.

మోడల్‌ స్కూల్స్‌ ప్రవేశాలకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్‌ : జిల్లాలోని ఏపీ మోడల్‌ స్కూళ్లలో 2024–25 విద్యాసంవత్సరానికి ఇంటర్మీడియెట్‌ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ దేవరాజు తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంపీసీ, బైపీసీ,ఎంఈసీ, సీఈసీ గ్రూప్‌లలో ఉచిత విద్యకు దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈనెల 28 నుంచి మే 22వ తేదీ వరకు www. apms.apcfss.in, www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీ,ఈడబ్ల్యూఎస్‌ లకు రూ.200, ఎస్సీ,ఎస్టీ లకు రూ.150 దరఖాస్తు రుసుం ఉంటుందని చెప్పారు. పూర్తి వివరాలకు ఏపీ మోడల్‌ స్కూల్స్‌ ప్రిన్సిపల్స్, ఎంఈఓ, డీఈఓ కార్యాలయంలో సంప్రదించి తెలుసుకోవచ్చని వెల్లడించారు.

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య

నగరి : మున్సిపల్‌ పరిధి చింతలపట్టెడ లింగిసుగుంటకట్ట వద్ద చెట్టుకు ఉరేసుకుని భాస్కర్‌ (45) అనే వ్యక్తి మృతిచెందాడు. సోమవారం ఉదయం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు విచారణ చేపట్టారు. సీఐ సురేష్‌ కథనం మేరకు.. ఏకాంబరకుప్పానికి చెందిన భాస్కర్‌ కొంతకాలంగా కుటుంబ సమస్యలతో సతమతమౌతున్నాడు. ఆదివారం రాత్రి ఇంటి నుంచి వచ్చేసిన అతను ఎక్కి చెట్టుకు ఉరేసుకుని మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి

బైరెడ్డిపల్లి: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన రాణి (35) అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. సోమవారం మధ్యాహ్నం ఎంపీడీఓ కార్యాలయం సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద మహిళ మృత దేహాన్ని పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పరిశీలించిన పోలీసులు రెడ్డెప్ప భార్య రాణిగా గుర్తించారు. విచారణలో రాణి భర్త రెడ్డెప్ప ఐదేళ్ల కిందటే మృతి చెందాడు. కుమార్తె రెడ్డి సారికతో కలిసి ఎస్సీ కాలనీలో రాణి ఉంటోంది. ఉపాధి పనులకు, కూలీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తోంది. నాలుగురోజుల కిందట కుమార్తె బంధువుల ఇంటికి వెళ్లడంతో రాణి ఒంటరిగానే ఉంది. ఈనెల 24 ఉదయం నుంచి కనిపించడం లేదు. సోమవారం మృతదేహంగా లభ్యం కావడంతో పోలీసులు అనుమానస్పదస్థితిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

చెరువును చెరబట్టిన పచ్చనేత

రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం..సహకారం వెరసి టీడీపీ నాయకుడి భూదాహానికి హద్దుల్లేకుండా పోతోంది. ఏకంగా చెరువును కబ్జా చేసేందుకు పూనుకున్నాడు. వెదురుకుప్పం మండలం చిత్తూరు–పెనుమూరు ప్రధాన రహదారి పక్కన, రెండు గ్రామాల మధ్య ఉన్న కుంటను యథేచ్ఛగా ఆక్రమించాడు. రూ.50 లక్షల విలువజేసే కుంట కబ్జాపై అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు మండిపడుతున్నారు.

- రూ.50 లక్షల విలువచేసే కుంట కబ్జాకు యత్నం
- ఫిర్యాదులు అందుతున్నా పట్టని రెవెన్యూ అధికారులు


మంచి నీళ్ల కుంటను చదును చేస్తున్న జేసీబీ

వెదురుకుప్పం: మండలంలోని జక్కిదొన రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్‌ 468లో 4.66 ఎకరాలు మంచి నీళ్ల కుంట టీడీపీ నేత కబ్జాకు గురైంది. గ్రామస్తుల కథనం మేరకు. ఏడు దశాబ్దాలుగా ఈ కుంటలోని నీరు పశువులు తాగేందుకు ఉపయోగపడేదని పాడి రైతులు చెప్తున్నారు. మంచి నీళ్ల కుంట ప్రధాన రహదారి పక్కన ఉంది. భవిష్యత్తులో భూముల విలువ అమాంతంగా పెరిగిపోతుందని జక్కిదొన గ్రామానికి చెందిన టీడీపీ రైతు విభాగం అధ్యక్షుడు, బూత్‌ కమిటీ అధ్యక్షుడు భీమినేని మాధవనాయుడుకు కుంటపై కన్నుపడింది. ఎలాగైనా కబ్జా చేయాలని ప్లాన్‌ చేశాడు. రెవెన్యూ అధికారులతో లాలూచీ పడి వారి సలహాలు, సూచనలతో మంచి నీళ్ల కుంటను ఆక్రమించేందుకు ప్రయత్నించాడు. ఎన్నికల కోడ్‌ ఉండడంతో అధికారులు రారని జేసీబీ పెట్టి కుంటను చదును చేసేందుకు ప్రయత్నించాడు. కుంటలో ఉన్న చెట్లను తొలగించి పెన్సింగ్‌ వేసేందుకు ఏర్పాట్లు చేశాడు. మూడు రోజులుగా జేసీబీ ద్వారా పనులు చేస్తున్నా పట్టించుకునే వారు లేరని స్థానికులు వాపోతున్నారు. 4.66 ఎకరాల కుంటలో సుమారు 1.66 ఎకరాలు రూ.50 లక్షలు విలువ చేసే కుంటను ఆక్రమించుకునే క్రమంలో గ్రామస్తులు అడ్డుకుని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. నిత్యం అధికారులు తిరిగే చోట, జనం సంచారం ఉన్న ప్రాంతంలోనే యథేచ్ఛగా ఆక్రమణలు జరుగుతున్నా రెవెన్యూ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆక్రమణను అధికారుల దృష్టికి తీసుకొచ్చినా ఎవరూ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామకంఠంలో ఇళ్లు కట్టుకోవడంతో వచ్చిన సమస్యతో సర్వే చేయగా రెవెన్యూ రికార్డుల్లో మంచి నీళ్ల కుంటగా ఉందని చెబుతున్నారు. వెదురుకుప్పం తహసీల్దార్‌ కార్యాలయంలో టీడీపీ సానుభూతి అధికారి అండదండలతోనే మంచి నీళ్ల కుంట ఆక్రమణకు గురౌతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. మంచి నీళ్ల కుంట ఆక్రమణను రక్షించి ఆక్రమణకు పాల్పడిన టీడీపీ నాయకుడిపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేస్తున్నారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు.

రూ.అరకోటి మద్యం స్వాధీనం

కుప్పం: ఎన్నికల తనిఖీలో భాగంగా కర్ణాటక నుంచి కుప్పానికి తరలిస్తున్న రూ.54 లక్షల కర్ణాటక మద్యాన్ని ఎస్‌ఈబీ అధికారులు స్వాధీనం చేసుకు న్నారు. ఎస్‌ఈబీ డీఎస్‌ఈవో సుబ్బరాజులు కథనం.. సోమవారం ఉదయం గుడుపల్లె మండలం, బిసానత్తం వద్ద ఎస్‌ఈబీ అధికారులు వాహనాలు తనిఖీ చేస్తున్నారు. మారుతి సుజికీ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా, 60 బాక్సుల కర్ణాటక టెట్రా ప్యాకెట్లు ఉన్నాయి. ఇందులోని చాయిస్‌ టెట్రా ప్యాకెట్లు 5760, సిల్వర్‌ కప్పులు 2880 స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.54 లక్షలు ఉంటుంది. కర్ణాటక రాష్ట్రం కెంపాపురం గ్రామానికి చెందిన వెంకటేష్, గుడుపల్లె మండలం, అనగర్లపల్లెకు మంజునాథ్‌ను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసినట్లు డీఎస్‌ఈఓ సుబ్బరాజులు తెలిపారు. ప్రతిభ కనబరిచిన సిబ్బంది ఉమామహేష్, దేవేంద్ర, ప్రభు, మధుకు క్యాష్‌ అవార్డులను అందజేశారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఈబీ సీఐ సృజన్‌ బాబు, ఎస్‌ఐ అన్వేష్‌ పాల్గొన్నారు.

చిత్తూరులో వెండి వస్తువుల స్వాధీనం


సీజ్‌ చేసిన వెండి వస్తువులను చూపుతున్న డీఎస్పీ

చిత్తూరు అర్బన్‌: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. చిత్తూరులో 15 కిలోల వెండి వస్తువులు పట్టుబడ్డాయి. టూటౌన్‌ పోలీస్‌ స్టేషన్‌లో డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, సీఐ ఉలసయ్య వివరాలను మీడియాకు వెల్లడించారు. సోమవారం రాత్రి చిత్తూరు–బెంగళూరు బైపాస్‌ రోడ్డులో టూటౌన్‌ పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఇరువారం కూడలి వద్ద ఓ కారులో తనిఖీలు చేపట్టగా విజయవాడకు వెళుతున్న వ్యక్తుల వద్ద పెద్ద సంచులు అనుమానస్పదంగా కనిపించాయి. వీటిలోపల దాదాపు 15 కేజీల బరువున్న వెండి వస్తువులను గుర్తించారు. వీటిలో పదుల సంఖ్యలో వెండి కంచాలు, గ్లాసులు, గరిటెలు, గిన్నెలు ఉన్నాయి. కారులో ఉన్న విజయవాడ పోరంకికి చెందిన వై.ఫణీంద్ర (42) సక్రమమైన బిల్లులు చూపించలేదు. దీంతో రూ.12 లక్షలు విలువచేసే వెండి వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఐలు ప్రసాద్, ఇక్బాల్, ఫ్లయింగ్, ఎంసీసీ అధికారులు గోపి, గోపాలకృష్ణవర్మ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ ఎన్నికల ప్రచారంలో పోస్ట్‌మాస్టర్‌


టీడీపీ ప్రచారంలో పోస్ట్‌ మాస్టర్‌ బాబు

పుత్తూరు: తెలుగుదేశం పార్టీ ఎన్నికల ప్రచారంలో పుత్తూరు మండలం తొరూరు పోస్ట్‌మాస్టర్‌ బాబు పాల్గొనడంపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. టీడీపీ నాయకులతో కలిసి బాబు ప్రచారం చేసిన ఫొటోలు సోమవారం సోషల్‌ మీడియాలో వైరల్‌ అయ్యాయి. దీనిపై ఆగ్రహించిన స్థానిక వైఎస్సార్‌ సీపీ నాయకులు నగరి ఎన్నికల రిటర్నింగ్‌ అధికారికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలకు సేవలందించాల్సిన అధికారులు తమ విధులను నిర్వర్తించకుండా ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న వారిని తక్షణం సస్పెండ్‌ చేయాలని డిమాండ్‌ చేశారు.